# నయాపైసా నాంది

నయాపైసా నాణాలపై ప్రచారంనిమిత్తం ప్రభుత్వంవారు అట్టముక్కలను సప్లై చేశారు. ఏదో వాగుడుగాయనుకదా అని నా స్నేహితుడు డిప్యూటీ తహశీల్ దార్ మల్లికార్జునరావు నాకూ ఒక అట్టఇస్తూ, "ప్రచారం చేయవోయ్" అన్నాడు.

ఎందుకైనా మంచిదని ముందుగా ఇంట్లోనే ప్రారంభిద్దా మనుకున్నాను నా ప్రచారం. ఇంటగెలిస్తేకదా, రచ్చ గెలువగలిగేది! మా ఆవిడ మానసికతత్వం తెలుసుగనుక, ముందుగానే జాగ్రత్త పడ్డాను. ఇంటికొచ్చేసరికి మా ఆవిడ వంటచేస్తూవున్నందున, ఆ సమయం మంచిదికాదని వూరుకున్నాను.

మెల్లగా భోజనాలయి వక్కలాకుల వ్యవహారంలో వున్నపుడు, ప్రారంభించాను, "ఇదుగో కొత్తరకం నాణాలను చూశావా?" అంటూ. "ఇవెక్కడివండి? ఇటువంటి పావలాలు మేము చిన్నప్పు డెక్కడో చూశామే?" అన్నది, పది నయాపైసాల నాణెం చూడగానే.

"అది పది పైసాల నాణెం" అన్నాను.

"అంటే-పది దమ్మిడీలా?"

"కాదు. ఇప్పుడు పైసాలని కొత్తరకం డబ్బులొచ్చాయి. ఇలాంటివి రూపాయకు వంద" అని ప్రారంభించాను నిదానంగా.

"ఏమిటీ-రూపాయకు వంద పైసలా! ఏమన్నా మతిపోయిందా? రూపాయకు 192 పైసలు కాదుటండీ!"

"ఆ-అదే-ఇకనించి రూపాయకు వంద పైసలే నన్నమాట."

"అయితే అణాకు?"

"ఇక అణాలు, అర్ధణాలు జాస్తైసై!"

"బేడలో?"

"బేడలు, గిడలు గోల్ మాల్ అయిపోతాయి-ఇక వుండేవల్లా-రూపాయి, అర్ధ రూపాయి, పావలా, పది పైసాలబిళ్ళ, ఐదు పైసాలబిళ్ళ, రెండు పైసాలబిళ్ళ,ఒక్క పైసా! అంతే!"

"ఇదేం పొయ్యేకాలం వచ్చిందీ-అంటా! మేం పుట్టకముందునుంచి వున్న డబ్బులు కాస్తా పోతే, మళ్లీ ఈ ముదరష్టపు లెక్కలన్నీ ఇప్పుడు నేర్చుకోవాలా?"

"తప్పదు—నేర్చుకోవాల్సిందే!"

"నాచేతకాదు బాబూ! వచ్చే నెలనుంచీ ఆ లెక్కా, డొక్కా మీరే చూసుకోండి!"

"శ్రీ మద్రమారమణ గోవిందో హరీ!" అనుకున్నాను. "నీ కందిపప్పు లెక్క, పాల లెక్క, పెరుగులెక్క ఇవన్నీ నేను చూడనా? నాచేతకాదు—కాదంటే కాదు! కావలిస్తే, రోజూ ఒకగంట ప్రైవేటు చెప్తాను. లెక్కలు నేర్చుకో. అంతేగాని నేనేమీ ఆ పాలవాళ్ళతో, పెరుగులవాళ్లతో బాధపడలేను."

"అసలీపని కాంగ్రెస్‌వాళ్లదేనా?"

"ఇక్కడ కాంగ్రెస్సూ—కమ్యూనిస్టూ అంటూ లేదు. సర్కారువారు మన నాణాలను సవరించారు. ఎందుకంటే.....దేశదేశాల్లో రూపాయలుగాని, ఏవిగాని—వందల లెక్కల్లో వుంటే,మనవి పన్నెండూ, పదహార్లూ అంటూ వున్నాయి—మన మిప్పుడు, దేశదేశాలతో వర్తక వ్యాపారాలు చేస్తున్నాం గనుక కొన్ని ఇబ్బందులు కలుగుతున్నాయి; అవన్నీ లేకుండా వుంటానికే ఈ పద్ధతి తెలిసిందా?"

"అయితే ఇంగ్లీషువాళ్ల పౌనుకు షిల్లింగులు?"

"ఇరవై."

"షిల్లింగుకు పెన్నీలు?"

"పన్నెండు."

"పెన్నీకి ఫార్తింగులు?"

"నాలుగు. నా నాలిక ఎండుతూంది. కాసిని మంచినీళ్లు తెచ్చిపెట్టు."

తాంబూలంవల్ల డొక్కపట్టం నిమోనని చప్పున లోపలికెళ్ళి మంచినీళ్లు పట్టుకొచ్చింది భామామణి. మెల్లగా నీళ్లు తాగి, మళ్ళీ మొదలుపెట్టాను నా నయాపైసాల నాందీ ప్రస్తావన.

"అసలు దేశంలో దశమానపద్ధతులు ప్రవేశపెట్టాలన్నదే ఈ మార్పు ఉద్దేశం. ఖర్చులుకూడా యార్డులు, పౌనులు, పదులు, ఐదుల్లో వుండాలేగాని, మూడు, నాలుగు, ఎనిమిది-ఈ విభాగాల్లో వుండరాదు. అందుకనే ఈ మార్పు చేస్తున్నారు మన ప్రభుత్వం వారు."

"అఘోరించినట్లే వున్నది. మీ జీతం


జీవితమును
మలబద్ధకము
భారముగా చేయనీయకండి




తలనొప్పులు, కోపిష్టితనము, ఆకలిమాంద్యము, చిన్నబుద్ధి, మందగొడితనము ఇవన్నీ శరీరములోని అపరిశుద్ధతకు పర్యవసానములుగా వచ్చును. కాని మలబద్ధకము మీ జీవితాన్ని పెద్ద భారముగా చేయవలసినది లేదు బ్రూక్‌లాక్స్ సేవించగనే తిరిగి సత్తువ చేకూరును. రుచికరమైన చాకొలెట్ విరేచనకారి మలాశయము ఉత్తేజపరచి మలిన పదార్థమును తప్పక నిరపాయముగా వెడలగొట్టును. ఈ రాత్రి ఒక చిన్న తునక వేసుకోండి. రేపు ఎంత చులకనగా, ఎంత చురుకుగా వుంటుందో గమనించండి.

కాని తప్పక మీరడిగేది బ్రూక్‌లాక్స్ అని మాత్రం రూఢిచేసుకోండి.

బ్రూక్‌లాక్స్
మిమ్ము రాత్రికి రాత్రి
సరిదిద్దును

బ్రిస్టల్ మయర్స్ లాబొరేటరీస్ లిమిటెడ్, లండన్ వారి నిర్మాణము
ఏజంట్లు:
ఓరియంటల్ మర్కెంటైల్ ఏజన్సీ,
మద్రాసు-1
బ్రాంచి: 17/117, నాగేశ్వరరావురోడ్, విజయవాడ-2



**హాయిగా నుండుడు**

దినకృత్యాలకుముందు హమామ్ తో ప్రతిరోజూస్నానము చేయుట వల్ల ఏవేళయందైనా హమామ్ తో స్నానము మిమ్ములను పరిశుభ్రమొనర్చును. హమామ్ పరిశుభ్రపర్చు గుణములుగల శుద్ధమైన సబ్బు.

టాటావారి

**హమామ్**

టాయిలెట్ సబ్బు




100% భారతీయమూలధనం.
యాజమాన్యం-శ్రమ

# ★ నయాపైసా నాంది ★

అంతా కలిపి—వందరూపాయలు కదా! ఏమిటి మీరు ఖర్చుచేసేది వందల్లోనూ—పాతికల్లోనూ!"

"ఆ-అలా దారికి రా! వందరూపాయలు అంటే వంద వందలు, పదివేల పైసాలన్న మాట!"

"ఇంకా శోలీల్లో లెక్క కట్టండి-ముప్ఫై వేలవుతాయి."

"అదుగో-అదే-మీ ఆడంగుల మన స్తత్వం! నీ వెప్పుడూ పాత చింతకాయపచ్చడి భావాలే! ఈ మార్పువల్ల మాన ఆర్థిక వ్యవస్థలో పెద్దమార్పు వస్తుంది. మన భావాలు మారిపోతాయి. మన పరిస్థితి మారుతుంది. మనం బాగుపడతాం. అసలు సంగతి తెలుసా? భారతం చదివావా? అప్పుడు లెక్కలన్నీ ఇలాగే వుండేవి. కౌరవులు వందమంది, పాండవులు అయిదుగురు-అంతే కాదు అన్నీ పదుల్లోనూ-వందల్లోనే వ్యవహారాలు."

"రామాయణంలోనో?"

"ఊ-అదైనా అంతే! రావణాసురుడికి పది తలకాయలు - రాములవారి సైన్యం పది లక్షల కోతులు, ఏదైనా విచారించుకో అన్నీ పదులు, పాతిక లేకాని, మూడులూ, ఏడులూ వుండవు."

"అలాగా!"

"మరేమనుకున్నావు! అందుకనే మీసం మీద చెయ్యేసి-మన ఈ కొత్త నాణాలకు 'నయాపైసా' అని నామకరణం చేశాము."

"పోనివ్వండి-నాకు చిన్న అనుమానం వచ్చింది. బేడలు పోతాయికదా, బ్రాడిపేట బంగ్లామూడి హనుమాయమ్మ బడి నుంచి మన చేబికి రిక్షాబాడుగ ఇప్పుడు బేడ. ఇక వాడికెంత ఇవ్వాలో చెప్పండి."

"వాడిక బేడ అడగడు."

"బేడగాక, పావలా అడుగుతాడా? ఇదేగా మీ నిర్వాకం! అడిగినవాడికి అడిగినట్లు ఇవ్వడం-బేరమాడకుండా!"

"అదికాదే-వాడు పైసాల లెక్కల్లోనే అడగాలి. పదిపైసాలు, పదిహేనుపైసాలు, ఇరవైఅయిదు పైసాలు, అని అడగాలి. మీరు-పాతిక అంటే ఇరవై, పదిహేనంటే పది-పది అంటే అయిదు-ఇలా బేరాలాడాలి. అది దర్జాగా వుంటుంది. చూడూ! ఇదివరలో బేడ అడిగాడనుకో. నీవు కాని తక్కువ బేడ అని అడగడం కించపరుస్తూ వుండేది. ఇప్పుడాబాధ లేదు."

"పోనీయండి-వంద పిడకలు పావలా-పాతిక పిడకల ఖరీదెంత?"

"అణా-ఛ!ఛ! వుండు-పావలాకు ఇరవై అయిదు పైసాలు; వందపిడకలూ ఇరవై అయిదు పైసాలు. ఇరవైఅయిదు పిడకలూ ఆరుంబాతిక పైసాలు. బేరమాడితే ఆరు పైసాలకు ఇస్తాడు."

"ఇవ్వనంటే"

"ఏడుపైసా లివ్వు"

"ఎడిసినట్టే వుంది. మన ఆదాచేయడం! వాడికీ - మనకూ ఇద్దరికీ నష్టంలేకుండా వుండాలి కానీ, ఇదేం పీడాకారం?"

"అందుకనే-ఇకనుంచీ - వంద పిడకలు-పాతిక పైసాలని బేరం మొదలెట్టు. పాతిక పిడకలు కొననేవద్దు; కొంటే యాభై, కాదు వందాకొను. లేకపోతే, అసలు మానేయ్!"

"పిడకలు లేకపోతే, పొయి రాజుకోవద్దూ? మీ పాడు పైసాలొచ్చి పిడకలు మానుకో మంటారా!"

"చాలెద్దూ-మహా-పిడకల లెక్క అడుగుతున్నావ్! దేశంలో మహత్తరమైన మార్పు తెచ్చే మన నయాపైసాల విషయం నేను చెప్తూవుంటే, నీవు పిడకలబేరం సంగతి తెస్తావా! అసలు మీ ఆడంగుల కెప్పుడూ పిడకల గొడవే!"

"పోనీయండీ. రూపాయకు ఆరుశేర్ల కుంకుడుకాయలు. శేరెంత? అర్థరూపాయకు మూడుశేర్ల వంకాయలు శేరెంత? మీ సిగరెట్లు - సిసర్ పెట్టె అయిదణాలు-ఇకముందు సిగరెట్టెంత? మీరు కొనితెచ్చుకునే చేబ్రోలు పొగాకు సవాశేరు నాలుగు రూపాయలు. అంటే ముప్పైకాడలొస్తాయి. కాడ ఎంతపడుతుంది? పాచిపనిమనిషి జీతం నెలకు రెండురూపాయలు; పన్నెండు రోజులే పనిచేసింది-ఎంతివ్వాలి?"

"ఆగవే - ఆగు! నీ పాచిపనిమనిషి లెక్కలూ, వంకాయలూ-కుంకుడుకాయల లెక్కలూనూ! తల తిరుగుతోంది" అని తప్పుకో ప్రయత్నించాను.

"అదిగో ఆ పత్రికలో పరివర్తన పథకం వుంది-చదువుకోండి," అంటూ పత్రిక నా మొఖాన పడేసి వంటింట్లోకి పోయింది. ఇప్పటికి నా కర్థమయింది-ఈ పరివర్తన పథకం మనం కంఠోపాఠం చేయాలి. తరువాత ప్రచారం ప్రారంభించాలి. చూశారా! ఇంట్లోగాబట్టి నేనెంత గాబరా తిన్నా సరిపోయింది. లేకపోతే ఈ నయాపైసాలు నామర్దా తెచ్చేవే! ఎందుకైనా మంచిది. ఈ లెక్కలు ఎంత త్వరగా నేర్చుకుంటే అంత మంచిదని నా సాదరీ - కాదు ముంగు సోదర పాఠకులకు వేరే చెప్పాలా? ★

—[శ్రీకంఠం కృష్ణమూర్తి.]